

# మా వారి వంట

"అబ్బబ్బ....వంట యింకా అవలేదా....అవతల ఆఫీసుకి టైమైపోతుంటే'' తొమ్మిదయ్యేసరికల్లా రోజూ మా ఆయన పాడే పాటే యిది.

కాని ఆ రోజెందుకో నాకు కాస్త చిరాకుగా వుండి నేనూ గయ్ఁమన్నాను.

"వంట చెయ్యడమంటే మాటలనుకున్నారా... లేక ఆఫీసులో కాగితాల మీద మీరు చేసే కూడికలు, తీసివేతలూ అనుకున్నారా....అసలే కిరసనాయిల్ దొరక్క అదో అవస్థ - చంటిపిల్లని చూసుకోవడం, బాబిగాడిని స్కూలుకి సిద్ధంచేయడం నా పనే...మీకేం మగ మహారాజులు - ఒక్క రోజు చేస్తే తెలుస్తుంది'' అన్నాను.

"అఁ...మహా కష్టపడిపోతున్నావు. అయినా పొద్దున్న అరగంట, సాయంత్రం ఓ అరగంట వంట చేయడానికీ, ఆఫీసులో పదినుంచి ఐదు దాకా రెక్కలు ముక్కలు చేసుకుని పని చేయడానికి తేడా లేదూ? స్టవ్ మీద గిన్నెలో యిన్ని నీళ్ళు పోసి బియ్యం పడేస్తే అదే వుడుకుతుంది అన్నం.''

ఇకాయనతో వాదనకి దిగడం ఎందుకని అప్పటికి వూరుకున్నాను. కాని పాపం ఆయన వంట చెయ్యాల్సిన అవసరం....నాకు, బాబిగాడికి ఆ వంట రుచి చూడాల్సిన ఖర్మ పట్టే రోజు అంత త్వరలో వస్తుందని నేననుకోలేదు.

ఆడవాళ్ళం నెలలో మూడు రోజులు సెలవు పుచ్చుకుంటాంగా....ఆ లాంటి సెలవే నేనూ పుచ్చుకోవాల్సివచ్చింది. అన్నాళ్ళు పక్కింట్లో మా బంధువులు వుండేవాళ్ళు. ఇలాంటి యిక్కట్లు వచ్చినప్పుడల్లా ఆ యిల్లాలు యింత వండి పడేస్తూ వుండేది. వాళ్ళకి ట్రాన్స్‌ఫర్ అయిపోవడంతో మరో వూరు వెళ్ళిపోయారు.

'ఎలాగురా భగవంతుడా' అని నేను ఆలోచిస్తూ వుండగానే "నువ్వేం భయపడకు....నేను చేస్తాను నేనుండగా నీకు దిగులేల'' అంటూ రంగంలోకి దూకారు మా ఆయన.

"అదే నా భయం'' అప్రయత్నంగా అన్నాను. తీరా అన్న తర్వాత నాలికకరుచుకుని ప్రయోజనమేమిటి చెప్పండి – నాలుక తెగడం తప్ప.

"హాత్! నువ్వలా అనడం మగవారి వంటకే అవమానకరం. ఆనాటి నలుడు, భీముడు....ఈనాటి మేటి హోటళ్ళలోని వంటవారు, అంతా ఎవరు, మగవారు కాదూ. ఏ హోటల్ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం? మగవారైన వంటవారే కదూ'' అంటూ దీర్ఘోపన్యాసం దంచే ప్రయత్నంలో పడిపోయారు.

అదృష్టవశాత్తు అప్పుడే మా బాబిగాడనే రవికుమార్ లేచి "కాఫీ....కావాలీ'' అంటూ హోటల్లో గజం ఎత్తు కాఫీ సాగదీసినట్లుగా సుదీర్ఘ రాగంలో సంగీతం మొదలుపెట్టాడు.

మా వారి కేసి చూశాను. అంతవరకు మాటలైతే మాట్లాడారుగానీ తీరా వంటింట్లోకి వెళ్ళాలనే సరికి బిక్కమొహం వేశారు. 'ఆయన వంట గదిలో ఏం పాట్లు పడతారో పాపం' అని అనుకోగానే నాకు నవ్వొచ్చింది. నా నవ్వు చూడగానే ఆయనకు రోషం వచ్చింది.

"ఒరేయ్....ఏడవకురా....నాన్నగారు కాఫీ చేస్తున్నారు'' అన్నాను బాబిగాడిని సమాధానం పరుస్తూ.

అప్పుడే రేడియోలో శేషశైలా వాస శ్రీ వేంకటేశా అంటూ మృదుమధురంగా ఘంటసాల పాటవినిపిస్తోంది. మా వారు మాత్రం ఆ పాటలోనూ, చేయబోయే వంటలోనూ నిమగ్నమైపోయారు. అందుకే ఆ పాట రాగంలోనే—

"భార్యామణీ .... నీవేమీ చింతించవద్దు. పిల్లవాడికి టిఫినూ, కాఫీ చేసిచ్చి స్కూలుకు పంపే బాధ్యత నాది. అంతగా అవసరమైతే ఆఫీసుకి సెలవు పెడతానులే. నా చేతి వంట నంత చులకనగా చూడకు దేవేరీ'' అంటూ వంటింట్లోకి అడుగు పెట్టారు.

మొదటి మెట్టుగా ఎంతో కష్టం మీద కాఫీ చేశారు. కళ్ళు మూసుకుని గొంతులో పోసుకున్నాను. నేను కూర్చున్న చోటు నుంచి వంట గది కొంత కనిపిస్తూ వుంది.

వాసిన కుడుములు వేద్దామని రాత్రి మినప్పిండి మాత్రం రుబ్బి వుంచాను. అందులో కాస్త బియ్యప్పిండి కలిపి "దోసెలు పొయ్యండి .... తేలికగా అయిపోతుంది'' అన్నాను.

ఆఫీసులో లెడ్జర్ వెతికినట్లు బియ్యప్పిండీ డబ్బాకోసం అల్మారా అంతా వెతకసాగారు ఆయన.

"తిరగలి వెనక-ఆ మూల-డబ్బాలో వుంది'' అని నేను అరుస్తూ వుండగానే.

"ఆ .... దొరికింది. దొరికిందోయ్'' అని గంతులు వేసారాయన.

"అరపావు పిండి కలపనా....'' అంటూ "ఆ చాల్లే....చాలకేం చేస్తుంది'' అని నా మాటకు ఎదురు చూడకుండా ఆ పిండిని చిన్న పాత్రలో వేసి, నీళ్ళు తడిపి కాస్తంత ఉప్పు, పసుపు, కారం అందులో పడేశారు. ఆయన ఏం చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. పోనీ ఏదైనా సలహా యిద్దామా అన్నా వెంటనే "నువ్వూరుకో.... నీకెందుకు....వంట ఆడవాళ్ళకే చేతనవుతుందా.... నలుడెవరు, భీముడెవరు, అసలు నల భీమపాకం అంటే ఏమిటి'' అంటూ నా మీద విరుచుకు పడతారన్నది గుర్తుకు వచ్చి నా ప్రయత్నాన్ని మానుకున్నాను.

స్టవ్ మీద పెనం పెట్టారు. చెంచాడు నూనె పెనం మీద పోశారు. అడ్డ పంచెను పైకెత్తి కట్టుకుని, పీట వాల్చుకుని కూచున్నారు. అంతటితో వూరుకున్నారా....మహాసామ్రాజ్యాన్ని జయించిన మహారాజులా నావైపు గర్వంగా చూశారు. ఆ తరువాత గిన్నెలో పిండిని గరిటితో పైనుండి ఎత్తి పెనంమీద పోశారు. ఇంకా కాలని పెనం మీద అంత ఎత్తు నుండి పిండిపోయగానే నూనె కాస్తా చింది ఆయన కాలిమీద పడింది.

"హా....హాఁ'' అంటూ లేచి నిల్చుని భరత నాట్యం చేయడం ప్రారంభించారు. కాని అంతలోనే నేను చూసి నవ్వుతానేమోనని 'అబ్బె ఏంలేదు. పురుగేదో యిచెళ్ళినట్లయితే' అని బాధ అణుచుకుంటున్న ఆయన్ని చూస్తే నాకు నవ్వొచ్చింది. జాలీ కలిగింది.

ఎలాగో కష్టపడి కొంత సేపటికి దోసెలు పోసి కొడుకును ప్రేమగా పిల్చారు.

# రతన్ ప్రసాద్

హైద్రాబాదు ఆకాశవాణి కేంద్రం నుంచి వెలువడే తెలుగు ప్రసారాలలలో అందరినీ ఆకర్షించేవి శ్రీమతి రతన్ ప్రసాద్ నిర్వహించే కొన్ని కార్యక్రమాలు.

ఎల్లమ్మగా, చంద్రిగా, రమణక్కగా, చిన్నక్కగానూ ఆమె రేడియో ద్వారా శ్రోతలకు చిరపరిచితురాలు. ఆ పాత్రలన్నీ కూడా ప్రజా హృదయాలను రంజింపజేస్తూ వారిలో గాఢంగా నాటుకున్నట్టివే. వివిధ శీర్షికల నిర్వాహకురాలిగా ఆమె అఖిలాంధ్రకోటి శ్రోతల అభిమానం పొందారు. అంతేకాదు. ఎన్నో నాటకాలను తన కంఠ మాధుర్యంతో రక్తి కట్టించారు. ఆమె చక్కటి నటి కూడా. కాని తన నటనను రేడియో నాటకాలకే ఆమె పరిమితం చేశారు.

'నటనను మీరు రేడియోకే ఎందుకు పరిమితం చేశారు?' అని ఎవరైనా ప్రశ్నిస్తే—

'' మేము నటనను వృత్తిగా మొదలుపెట్టినప్పుడు రేడియోలో నటించడమే ఎన్నో విమర్శలకు కారణమైంది. అందువల్ల రంగస్థలంపై నటించడానికి వెనకంజవేశాము. అయినా నేను రంగస్థలంపై రెండు, మూడుసార్లు నటించాను. ఐతే, అదీ రేడియో ద్వారానే '' అంటారు రతన్‌ప్రసాద్.

అప్పుడు ఆమె కేంద్ర ప్రభుత్వోద్యోగుల సంక్షేమ సమన్వయసంఘం నిర్వహించిన నాటక పోటీలలో వరుసగా మూడేళ్ళు 'ఉత్తమ నటి' బహుమతి కూడా పొందారు.

రతన్‌ప్రసాద్ రేడియో ఆర్టిస్టుగానే కాక నవలా రచయిత్రిగా కూడా పేరు తెచ్చుకున్నారు. ఆమె రాసిన మొదటి నవల-'ఆవలి తీరాలు'. ఈ నవల నవ్యసాహితీ సమితివారి బహుమతి పొందింది. ఇటీవల వెలువడిన వీరి నవలలు-'ఎప్పటికీ నీకేమీ కాను', 'తెర తొలగింది'.

'రేడియో కళాకారిణిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించి, స్థిరపడిన మీకు నవలా వ్యాసంగం చేపట్టాలన్న అభిలాష ఎలా కలిగింది?' అని ప్రశ్నించినప్పుడు-

'' చాలా రోజుల నుంచీ నాకు రచనపట్ల ఉత్సాహం వుండేది. చిన్న చిన్న కథలు ఎన్నో రాశాను. నా రచనలు చాలామటుకు రేడియో ద్వారా ప్రసారం అయ్యాయి. రానురాను అసంఖ్యాకంగా



వెలువడుతున్న పత్రికలు, నవలలపై ఈ తరం చూపుతున్న మోజు-నేను కూడా నవలలు రాయడానికి ప్రోద్బలం చేసింది. అందుకు స్నేహితుల ప్రోత్సాహం తోడయ్యింది'' అని చెప్పారు రతన్ ప్రసాద్.

'రచనా వ్యాసంగంలో పురుషులను అధిగమించి విస్తృతంగా నేడు స్త్రీలు రచనలు చేస్తున్నారు' అన్న విషయంపై ప్రస్తావిస్తూ '' స్త్రీలు అధికంగా రచనలు చేయడానికి కారణం వారికి తీరిక వుండడమేనని పలువురు అభిప్రాయపడతారు. కాని అంతకుమించి స్పందించే సున్నితమైన మనస్సు స్త్రీలలోనే ఎక్కువ. అందుకే వారు కుటుంబ జీవితాన్ని యథాతథంగా చిత్రించగలరు. కాని నేడు పాఠకుల సంఖ్యకన్న రచయిత(త్రు)ల సంఖ్య అధికమవుతోందేమోననిపిస్తోంది. అందుకే కథల సంఖ్యపై కాకుండా నాణ్యతపైన దృష్టి వుంచాలి. వ్యాపారదృష్టితో సినిమాలకోసమో, పోటీలకోసమో కాకుండా సంఘ ప్రయోజనాన్ని దృష్టిలో వుంచుకుని రాసినప్పుడే ఈస్థితి మెరుగవుతుంది '' అన్నారామె.

శ్రీమతి రతన్‌ప్రసాద్‌కి మన సంస్కృతి, సంప్రదాయాలపట్ల గౌరవం వుంది కాని గుడ్డి నమ్మకం లేదు. ఆమెకి కొన్ని విప్లవాత్మక భావాలు వున్నాయి. 'వైధవ్యం సంప్రాప్తించిన తరువాత స్త్రీ-సంఘం దృష్టిలో నుదుట బొట్టు, తాళిబొట్టు కూడా కోల్పోతుంది. నుదుట బొట్టు అలంకార ప్రాయం. భర్తపోయిన స్త్రీ అందంగా కనిపించకూడదన్న ఛాందస భావంతో మన పూర్వీకులు నుదుట బొట్టు వుండకూడదని అన్నారు. ఆ విధంగానే భర్త చనిపోయాక అతనిచే కట్టబడిన తాళిబొట్టు తీసివేయాలని అన్నారు. కాని అలా తీసివేయవలసిన అవసరం లేదు. భర్త స్మృతి చిహ్నంగా స్త్రీ తాళిబొట్టును తన మెడలో వుంచుకోవచ్చును' అని అభిప్రాయపడతారు రతన్‌ప్రసాద్.

'స్త్రీల పురోభివృద్ధికి స్త్రీలే గొడ్డలిపెట్టుగా ప్రవర్తించడం శోచనీయం. ఒక ఆడది, మగవాడితో కలిసి మాట్లాడినంత మాత్రాన వారిరువురి మధ్య సంబంధం అంటగట్టి చిలవలుపలవలుగా సృష్టించే వారిలో అధికులు స్త్రీలే. ఇది దురదృష్టకరమైన విషయం. స్త్రీలు సాటిస్త్రీలను అర్థం చేసుకుని ఒకరిపై ఒకరు అభాండాలు, అపవాదులు వేయకుండా సమాజంలో వున్నతస్థాయికి చేరుకునే రోజు త్వరలో రావాలన్న' ఆకాంక్షను ఆమె వ్యక్తం చేశారు. □

—భార్గవి పి. రావు

మా అబ్బాయి దోసె తుంచి నోట్లో పెట్టుకుని కొరికాడు. వెంటనే 'థూ' అని వుమ్మేస్తూ ఏడుపు లంకించుకున్నాడు.

వాడినెలా సముదాయించాలో .... అసలెందుకు ఏడుస్తున్నాడో అర్థంకాక మా ఆయన తెల్లమొహం వేసుకుని నా వైపు చూశారు.

'' ఏరా రవి ఎందుకా ఏడుపు....దోసెలో కారం ఎక్కువైందా? '' అనడిగాను వాడిని బుజ్జగిస్తూ.

'' కాదు, గరగరగా వుంది దోసె....రాళ్ళతో చేసినట్లుంది. నువ్వు చేసిన దోసెలా లేదు '' ఏడుస్తూనే అన్నాడు వాడు.

''ఏమండీ....అబ్బాయి దోసె రాళ్ళతో చేసినట్లుందంటున్నాడు. మీరు ఏ డబ్బాలో పిండి వాడారు '' సందేహంగా అడిగాను శ్రీవారిని.

మా వారు మాత్రం యింకా తమ నాటక ఫక్కీని వదలలేదు. '' ఇంత బాగా వేగి....యింత చక్కగా కాలిన దోసె మీద ఆఫ్టరాల్ - ఒక కుర్ర వెధవ మాటలు నమ్మి నువ్వు నన్ను సందేహిస్తావా-దేవరీ-ఇదిగో తెచ్చెదన్ '' అంటూ రాగాలాపన చేస్తూ వెళ్ళి డబ్బా తీసుకువచ్చారు.

ఆ డబ్బా చూడగానే నాకు మతి పోయినంత పనైంది.

'' అయ్యో రామా! అది బియ్యప్పిండి డబ్బా కాదండీ....ముగ్గుపిండి డబ్బా '' అన్నాను నుదురు కొట్టుకుంటూ.

బిక్కమొహం వేశారు శ్రీవారు.

—ప్రేమనారాయణ్